

ధాన్యం కొనుగోళ్లలో
ఇబ్బందులు ఉండొద్దు 7
అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

తాండూరు బైపాస్‌కు రూ.108 కోట్లు
నిర్వాసితులకు రూ.42.53 కోట్లు 6

షాట్‌పుట్‌లో బంగారు పతకం



సాయికిరణ్

దుద్యాల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): షాట్‌పుట్ జాతీయ స్థాయి విభాగంలో దుద్యాల్ మండలంలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన అల్వాల్ సాయికిరణ్ బంగారు పతకం సాధించాడు. 40వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ అండర్-20 క్రీడా పోటీలు ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో 10వ తేదీ నుంచి కొనసాగుతున్నాయి. పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. తెలంగాణ తరఫున షాట్ పుట్ విభాగంలో సాయికిరణ్ పాల్గొన్నాడు. 12వ తేదీన జరిగిన పోటీల్లో సాయికిరణ్ 18.42మీటర్ల దూరం విసిరి మొదటి స్థానంలో నిలిచాడు. సాయికిరణ్ బంగారు పతకం సాధించడంతో గ్రామస్తులు అభినందించారు.

తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీల్లో రచిత్ ప్రతిభ



పరిగి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పరిగికి చెందిన విద్యార్థి రచిత్ ప్రతిభను చాటాడు. పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్‌లో ఆరో తరగతి చదువున్న మేదర రచిత్ తైక్వాండోలో బంగారు, వెండి పతకాలు సాధించాడు. సోమాఫిట్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలోని నార్సింగ్ సుందర్‌గార్డెన్‌లో సోమవారం జరిగిన మూడో సోమాఫిట్ తైక్వాండో చాంపియన్‌షిప్-2025 రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. రచిత్ పూంసే విభాగంలో బంగారు పతకం, క్యోరూగి విభాగంలో వెండి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల యజమాన్యం రచిత్‌ను అభినందించారు.

పట్టణాల్లో తాగునీటి సమస్యను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'అమృత్' పథకం అమలు ఆలస్యమవుతోంది. పరిగి మున్సిపాలిటీకి రూ.15.50 కోట్ల నిధులు మంజూరు చేసినా పనులు ముందుకు సాగడం లేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల ఏడాది క్రితం పనులు ప్రారంభించినా 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న చందంగా దర్శనమిస్తున్నాయి. నాలుగు వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం, 30కి.మీ పైప్ లైన్ పనులు ప్రారంభ దశలోనే నిలిచిపోయాయి. దీంతో పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పరిగి మున్సిపాలిటీ పరిధిలోని తిరుమల రెసిడెన్సీలో పిల్లర్ల దశలో నిలిచిన ట్యాంక్ నిర్మాణం

అమృత్.. ఆలస్యం!

శాశ్వత తాగునీటి నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం

తొలి దశలోనే ట్యాంకులు, పైపులైన్ నిర్మాణం ◆ 11 నెలలుగా ముందుకు సాగని పనులు

పనుల పూర్తికి ఇచ్చింది 9 నెలల గడువు ◆ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం.. అధికారుల నిర్లక్ష్యం

◆ పరిగి మున్సిపాలిటీ పరిధిలో దుస్థితి

పరిగి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పరిగి పురపాలక సంఘం పరిధిలో నీటి వసతి నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. గుత్తేదారు నిర్లక్ష్యం వల్ల పనులు ముందుకు సాగడం లేదు. కేంద్ర ప్రభుత్వం అమృత్-2 కింద పరిగి పట్టణానికి రూ.15.50 కోట్లు మంజూరు చేసింది. గతేడాది నవంబరు 25న పరిగి ఎమ్మెల్యే



రామ్మోహన్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేసిన సంగతి విదితమే. అనంతరం పనులు ప్రారంభించి వదిలేశారు. ఏడాదికాలంగా పనులు నత్తనడకన సాగుతున్నా సంబంధిత అధికారులు కన్నెత్తి చూడటంలేదు. పట్టణంలో కొత్తగా లైన్ వేసేందుకు పైపులు సైతం వచ్చాయి. కానీ ఆ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. మున్సిపాలిటీ పరిధిలో 16.50 లక్షల లీటర్ల సామర్థ్యం గల నాలుగు వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులు ప్రారంభించి వదిలేశారు. తిరుమల వెంచర్‌లో 5లక్షల లీటర్లు, 2.50లక్షల లీటర్ల సామర్థ్యం గల రెండు ట్యాంకులు, వేంకటేశ్వరకాలనీలో 4 లక్షల లీటర్లు, తహసీల్దార్ కార్యాలయం వద్ద 5 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకులను నిర్మించాలని

మిగతా 8వ పేజీలో...

సబ్ కాంట్రాక్ట్‌లు ఇవ్వడంతోనే ఇబ్బందులు

నీటి ట్యాంకులు, పైపులైన్ నిర్మాణ పనుల్లో గుత్తేదారు నిర్లక్ష్యం వల్ల పనులు ముందుకు సాగడం లేదు. ప్రధాన కాంట్రాక్టర్ సబ్, సబ్ ఇలా రెండు, మూడు స్థాయిలో గుత్తేదార్లను మార్చడం వల్ల పనులు సక్రమంగా జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగు ట్యాంకుల నిర్మాణాలు గుంతలు తవ్వి వదిలేశారు. ఒక ట్యాంకు నిర్మాణానికి మాత్రం బేస్ స్థాయి వరకు నిర్మించి వదిలేశారు. ఇదిలా ఉండగా పైపులైన్ వేసేందుకు సీసీ, తారు రోడ్లను అడ్డంగా తవ్వి వదిలేస్తున్నారు. తవ్విన గుంతలను సరిగ్గా పూడ్చకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పనులు చకచకా చేపట్టి పట్టణ నీటి సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



పరిగిలో తాగునీటి సరఫరా పనులు గతేడాది నవంబరులో ప్రారంభించారు. ఇప్పటి వరకు కనీసం పదిశాతం కూడా పూర్తికాలేదు. ఆరంభశూరత్వంగానే పనులు నిలిచిపోయాయి. వేసవిలో తాగునీటి సమస్య పెరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

-బి.విష్ణువర్ధన్‌రెడ్డి, తిరుమల రెసిడెన్సీ, పరిగి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ సభ్యుడు, జిల్లా అబ్జర్వర్ సూరత్ సింగ్ ఠాగూర్

డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తుల ఆహ్వానం

పార్టీ కోసం పని చేసిన వారికి అవకాశం

ఏఐసీసీ సభ్యుడు, జిల్లా అబ్జర్వర్ సూరత్ సింగ్ ఠాగూర్

వికారాబాద్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏఐసీసీ సభ్యుడు, జిల్లా అబ్జర్వర్ సూరత్ సింగ్ ఠాగూర్ తెలిపారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని సత్యభారతి ఫంక్షన్ హాల్‌లో డీసీసీ అధ్యక్ష పదవి కోసం అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 19వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనున్నట్లు తెలిపారు. ప్రతీ మండలానికి వెళ్లి నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడతామన్నారు. 16వ తేదీ వరకు డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకోవచ్చని నాయకులకు సూచించారు. జిల్లాలో పర్యటించి కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలు, దరఖాస్తు చేసుకున్న నాయకుల గురించిన అంశాల నివేదికను అధిష్ఠానానికి అందిస్తామన్నారు. ఆ నివేదిక ప్రకారం జిల్లా అధ్యక్షుడిని పార్టీ పెద్దలు నిర్ణయిస్తారన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ సీనియర్ నాయకులకు ఇంటికి వెళ్లి వారి అభిప్రాయాలు సైతం తీసుకుంటామన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి భవిష్యత్తులో అవకాశాలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ అబ్జర్వర్లు బెల్లయ్య నాయక్, నీలిమ, వేణుగౌడ్, డీసీసీ అధ్యక్షులు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

నేడు తాండూరులో 'స్వర్ణామృత ప్రాశన'



తాండూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్, ధన్వంతరి ఆయుర్వేద చికిత్సాలయ, పంచకర్మ కేంద్రం ఆధ్వర్యంలో నేడు(14వ తేదీన) మధ్యాహ్నం స్వర్ణామృత ప్రాశన కార్యక్రమం ఉంటుందని నగర సేవ ప్రముఖ్ మైలావరపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరసిద్ధి వినాయక ఆలయం ఆదర్శ తులసీ నగర్‌లో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఏడాది పిల్లల నుంచి 16 సంవత్సరాల వరకు స్వర్ణామృత ప్రాశన చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. శారీరక బలం, ఆకలి, జీర్ణ ప్రక్రియ మెరుగు, జ్ఞాపకశక్తి మెరుగుపర్చడం, చర్మం కాంతి మెరుగు పర్చడంతో పాటు రోగ నిరోధక శక్తిని, తెలివిని పెంచడం, జలబు, దగ్గు లాంటి సీజనల్ వ్యాధుల నుంచి ఈ చుక్కలు రక్షిస్తాయన్నారు. ఇతర వివరాలకు 9154795529 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



ఎదులాబాద్ రోడ్డులోని అండర్ పాస్ వద్ద ట్రాఫిక్ జామ్

ట్రాఫిక్ అస్తవ్యస్తం!

ఘట్‌కేసర్‌లో పెరిగిన వాహనాల రద్దీ .. రోడ్డు అండర్ పాస్ వద్ద నిత్యం జామ్

యూటర్న్ వద్ద నిలుస్తున్న వాహనాలు.. ఉదయం, సాయంత్రం వేళల్లో తిప్పలు

పట్టించుకోని అధికారులు.. ఇబ్బందుల్లో వాహనదారులు

ఘట్‌కేసర్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ పరిధిలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ప్రధానంగా ఎదులాబాద్ రోడ్డులో నిత్యం వాహనాలు నిలిచిపోతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడతుఉన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఘట్‌కేసర్ పట్టణంలో వాహనాలు నత్తనడకన నడుస్తున్నాయి. ఇరుకు రోడ్లకు తోడు ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలుపుతుండటం, అంబేడ్కర్ చౌరస్తాలో రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేయడం వలన వాహనాలు ముందుకు కదలని పరిస్థితి ఉంటోంది. మున్సిపల్ అధికారులు ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టకపోవడంతో సమస్య ఏళ్లుగా అలాగే ఉంది. వాహనాలు రద్దీ పెరుతున్నప్పటికీ ఆ రద్దీని తట్టుకునే విధంగా రోడ్లను అభివృద్ధి చేయడం లేదనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.

ఆక్రమణల వలనే..

ఘట్‌కేసర్‌లో అడుగడుగునా రోడ్లను ఆక్రమిస్తున్నా ఎవరూ పట్టించుకోని పరిస్థితి. తాజాగా ఎదులాబాద్ రోడ్డులోని వీయూపీ వద్ద తరచు ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. గత మూడు రోజులుగా ట్రాఫిక్ సమస్యలు మరీ తీవ్రమయ్యాయి. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి నుంచి రెండు సర్వీస్ రోడ్లు కలిసే చోట భారీ వాహనాలు తిరగడానికి(యూటర్న్) సరిపడా స్థలం

మిగతా 8వ పేజీలో...

నిత్యం ఇబ్బందులే..



ఎదులాబాద్ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ రద్దీ మరీ ఎక్కువగా ఉంటుంది. అత్యవసర సమయాల్లో ముందుకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నాం. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం విధిగా ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలి. ప్రధానంగా విద్యార్థులు, ఉద్యోగులు వచ్చే పోయే సమయం కావడం వలన మరింత ఆలస్యం అవుతోంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలి.

-వరికుప్పల లింగస్వామి,వాహనదారుడు, ఎన్ఎఫ్‌సీ నగర్

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెన్షన్, వ్యవసాయం, గృహనిర్మాణ శాఖ, భూ సంబంధిత సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయన్నారు. కాగా, ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 56 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ హర్ష్‌చౌదరి, డీఆర్‌ఓ మంగిలాల్, ఆర్డీవో వాసుచంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్‌లో 81 ఫిర్యాదులు

మేడ్చల్, అక్టోబర్ 13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 81 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ మను చౌదరి తెలిపారు. వచ్చిన ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డిలతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన ఫిర్యాదులను పరిశీలించి, తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో హరిప్రియ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కబడ్డీ జిల్లా జట్టుకు విద్యార్థుల ఎంపిక

దౌల్తాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అర్జున్, ఇందు జిల్లా కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. అగ్గనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14 విభాగంలో పాల్గొని ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీహరిరెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయమ ఉపాధ్యాయురాలు శ్రీలత, విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



పరిగిలో దరఖాస్తు చేస్తున్న ఓ కుటుంబం

59 వైన్స్‌లకు 118 దరఖాస్తులు

వికారాబాద్/పరిగి, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 59 మద్యం దుకాణాలకు గాను సోమవారం నాటికి 118 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. శనివారం నాటికి 60 దరఖాస్తులు రాగా, సోమవారం 58 అర్జీలను స్వీకరించారు. ఇప్పటివరకు వికారాబాద్ పరిధిలో 22, పరిగి పరిధిలో 48, తాండూరు పరిధిలో 23, మోమిన్‌పేట పరిధిలో 12, కొడంగల్ పరిధిలో 13 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'వైన్స్.. నో రెస్పాన్స్' శీర్షికతో ప్రచురితమైన కథనానికి విశేష స్పందన లభించింది.

ఘట్‌కేసర్‌లో 296..

ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలోని 41 మద్యం దుకాణాలకు సోమవారం సాయంత్రం వరకు 296 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ జూపల్లి రవి తెలిపారు. 18వ తేదీ వరకు దరఖాస్తుల గడువు ఉందని, అభ్యర్థులు 21 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. ప్రతీ దరఖాస్తు పత్రంతో పాటు రూ.3 లక్షల డీడీ (ఒరిజినల్) జతపరిచాలని తెలిపారు. కులధ్రువీకరణ పత్రం, అండర్‌టేకింగ్ పత్రంతో 3 పాటు పాస్ ఫొటోలు తీసుకురావాలన్నారు.

అభిప్రాయ సేకరణతో అధ్యక్షుడి ఎంపిక

మేడ్చల్ జిల్లా అబ్జర్వర్ అంజలి నింబాల్కర్

శామీర్‌పేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే తొలిసారిగా, వినూత్న రీతిలో క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తల అభిప్రాయాలను సేకరించి డీసీసీ అధ్యక్షుల నియామకాన్ని చేపడుతున్నట్లు ఏఐసీసీ పరిశీలకురాలు(అబ్జర్వర్) అంజలి నింబాల్కర్ తెలిపారు. సోమవారం శామీర్‌పేట మండలంలోని అంతాయిపల్లి పరిధిలోని ఎస్ఎన్ఆర్ వేద కన్వెన్షన్ హాల్‌లో మేడ్చల్ నియోజకవర ముఖ్య నాయకుల, కార్యకర్తల సృజన అభియాన్ ముఖాముఖి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అంజలి నింబాల్కర్, పీసీసీ పరిశీలకురాలుగా సింగాపురం ఇందిర హాజరయ్యారు. ఈ సందర్భంగా నింబాల్కర్ మాట్లాడుతూ తెలంగాణతో పాటు అన్ని రాష్ట్రాల్లో ఈ తరహా అధ్యక్ష పదవుల నియామకాన్ని చేపట్టినట్లు వివరించారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు ప్రాధాన్యతనిస్తూ క్షేత్ర స్థాయిలో వాస్తవాల ఆధారంగా అధ్యక్ష నియామకాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్, సీనియర్ నేత నక్కా ప్రభాకర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ ఏబ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ అధిష్ఠానం ఆదేశాలను పాటిస్తూ పార్టీకి సేవ చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్ష పదవికి ఏడుగురు నాయకులు దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తు సమర్పించిన వారిలో వజ్రేశ్ యాదవ్, నక్కా ప్రభాకర్‌గౌడ్, జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి, సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, రాపోలు రాములు, హరి మోహన్‌రెడ్డి, రేణుకుమార్ ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లా అబ్జర్వర్‌కు దరఖాస్తు అందజేస్తున్న నక్కా ప్రభాకర్‌గౌడ్



సమావేశానికి హాజరైన ముఖ్య నాయకులు, కార్యకర్తలు

తాండూరు బైపాస్‌కు రూ.108 కోట్లు

● భూ నిర్వాసితులకు రూ. 42.53కోట్ల కేటాయింపు

తాండూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తాండూరు బైపాస్ రోడ్డు కోసం రూ.78 కోట్ల నుంచి రూ.108 కోట్లకు నిధులు పెంచుతూ తెలంగాణ రోడ్లు భవనాల శాఖ జీవో 130ని విడుదల చేసింది. అసంపూర్తిగా ఉన్న పనులు చేపట్టడంతో పాటు భూ నిర్వాసితులకు పరిహారం పెంచింది. భూ నిర్వాసితులకు రూ.42.53 కోట్లు కేటాయించారు. నాన్‌అగ్రికల్చర్ భూమికి రూ. 6 వేలు, వ్యవసాయ భూమికి ఎకరానికి రూ.21లక్షలు ప్రభుత్వం చెల్లించనుంది. ఇటీవల తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి రోడ్లు భవనాలశాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్‌ను కలిసి బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. 2016-17 సంవత్సరంలో రసూల్‌పూర్ నుంచి చెంగోల్ వరకు సుమారు 12 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. 18 ఎకరాల మేర రైతులు భూములు కోల్పోతున్నారు. యాలాల మండలం కోకట్, రసూల్‌పూర్ గ్రామానికి చెందిన సుమారు 10మంది బైపాస్ రోడ్డు నిర్మాణంలో ప్లాట్లను కోల్పోతున్నారు. అప్పట్లో కొంత మందికి పరిహారం చెల్లించి రూ.35 కోట్ల వ్యయంతో పనులు అసంపూర్తిగా చేసి వదిలేశారు. అంతేకాకుండా అప్పట్లో కొంత మంది రైతులు పరిహారం చెల్లింపులో న్యాయం జరగలేదని కోర్టును ఆశ్రయించడం , భూములు ఇచ్చేందుకు అభ్యంతరాలు తెలపడంతో భూసేకరణ నిలిచిపోయింది. దీంతో పనులు కూడా ఆగిపోయాయి. పరిహారం పెంపు, బైపాస్ రోడ్డు కోసం నిధుల వెచ్చింపుతో ఈ రోడ్డుకు పట్టిన గ్రహణం వీడనుంది. బైపాస్ రోడ్డు లేని కారణంగా పలు వాహనాలు తాండూరు పట్టణం మీదుగా వెళ్తూ దుమ్ముధూళితో పాటు భారీ వాహనాలతో రోడ్లు తింటున్నాయి. బైపాస్ రోడ్డు పూర్తయితే తొలగనున్నాయి. వెంటనే పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం



సీపీఎంలో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న యాదయ్య

సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

ఆదిభట్ల/యాచారం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజలను మోసంగించాయని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. యాచారం మండలం ధర్మన్నగూడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు నరసింహ, మధు, ఆనంద్‌తో పాటు 30 మంది ధర్మన్నగూడలో ఎర్ర జెండా కప్పుకున్నారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం రాజీలేని పోరాటం చేస్తుందని తెలిపారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి నరసింహ, శ్రీమన్నారాయణ, తావునాయక్, అంజయ్య పాల్గొన్నారు.

అభినయంతో అలరించిన హితిక



షాద్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కూచిపూడిలో అద్భుత హావభావాలతో, అభినయంతో అలరించింది షాద్‌నగర్ పట్టణానికి చెందిన 8వ తరగతి విద్యార్థిని హితిక. దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా మహతి ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలుగు విశ్వ విద్యాలయంలో సంగీత, నృత్య నీరాజనం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. హితిక బ్రహ్మాంజలి అనే గానంపై ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. నాట్య గురువు సజని వల్లభనేని చేతుల మీదగా మెమోంటో, ప్రశంసాపత్రం అందుకుంది. ప్రభోదయ డాన్స్ మ్యూజిక్ అకాడమికి చెందిన గురువు రంజు ప్రవీణ వద్ద హితిక శిక్షణ తీసుకుంది.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దు

శంకర్‌పల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దని శంకర్‌పల్లి మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్ కోరారు. శంకర్‌పల్లి మున్సిపల్‌లో సోమవారం మున్సిపల్ సిబ్బందితో కలిసి వీధి వ్యాపారులు, దుకాణాదారులకు పలు సూచనలు చేశారు. రోడ్డుకు అడ్డంగా బండ్లు పెట్టి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, వార్డు అధికారులు ఉన్నారు.



పశువులకు టీకాలు వేయించాలి



షాబాద్: మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్/మొయినాబాద్ రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పశువులు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన రైతులతో మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు మండలంలోని 41 గ్రామ పంచాయితీల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని తెలిపారు. పశువులు కలిగిన రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వచ్చే నెల 14 వరకు..

మొయినాబాద్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పశువులు, జీవాలకు ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు గాలికుంటు నివారణ టీకాలను వేస్తామని మొయినాబాద్ మండల పశువైద్యాధికారి డాక్టర్ అహ్మద్ పేర్కొన్నారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొదటి రోజు కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధిలోని సురంగల్ గ్రామంలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు



మాడ్గుల: వ్యాచరచన పోటీల్లో విద్యార్థినులు

మాడ్గుల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కస్తూర్బా గాంధీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు పోషకాహార మసోత్సవంపై సూపర్‌వైజయమ్మ వ్యాచరచన పోటీలు నిర్వహించారు. రక్తహీనత రాకుండా ఉండటానికి ఆకుకూరలు, కాయగూరలు పండ్లు, చిరుధాన్యాల అవసరంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో రేఖ, అంగన్‌వాడీ టీచర్ హైమావతి, రాణి, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట: పోషణ మాసంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని సంగెం ప్రాథమికోన్నత పాఠశాలలో 7, 8 తరగతుల విద్యార్థులతో సీడీఎస్ కొత్తపేట సెక్టార్ సూపర్ వైజర్ శమంతకమణి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం విద్యార్థినులకు 'తినే ఆహారం- శారీరక పెరుగుదల' అనే అం శంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన ఇద్దరికి బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాటీ టీచర్లు శశికళ, శివలీల, ఆశా కార్యకర్త అరుణ, ఉపాధ్యాయునిలు శివజ్యోతి, ప్రసన్న, దీపిక పాల్గొన్నారు.

నిల్వ చేసిన పత్తికి నిప్పు పెట్టిన దుండగులు

●15 క్వింటాళ్ల పత్తి కాలి బూడిదైన వైనం



ఎక్మాయి శివారులో కాలి బూడిదైన పత్తి

బషీరాబాద్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): ఓ రైతు వ్యవసాయ పొలంలో నిల్వ చేసిన పత్తికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిబుడిదైంది. ఈ సంఘటన బషీరాబాద్ మండలం ఎక్మాయి శివారు ప్రాంతంలో సోమవారం ఉదయం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన దానం కృష్ణ తన వ్యవసాయ పొలంలో ఆదివారం పత్తిని తీయించి అక్కడే నిల్వ చేశాడు. ఈ క్రమంలో రాత్రివేళ పత్తికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దాదాపు 15 క్వింటాళ్ల కాటన్ పూర్తిగా కాలిపోయింది. కాలి బూడిదైన పత్తి విలువ రూ.లక్షా30వేల పైబడి ఉంటుందని రైతు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న బషీరాబాద్ ఎస్ఐ నుమాన్‌అలీ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ కోతల చెక్‌కు సమ్మర్ యాక్షన్ ప్లాన్

● అదనంగా 23 ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ప్రతిపాదనలు

తాండూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై అప్పుడే అధికారులు దృష్టి సారించారు. వచ్చే సమ్మర్‌లో విద్యుత్ కోతలు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై సీఎండీ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా తాండూరు డివిజన్‌లో ప్రతీరోజు 100 మెగావాట్ల విద్యుత్ వాడకం ఉంటుంది. వేసవిలో 125 -130 మెగావాట్ల వరకు విద్యుత్ వాడకం పెరుగుతుంది. విద్యుత్ వినియోగం పెరిగితే తరుచూ ట్రాన్స్‌ఫార్మర్లు ఫీడర్లపై భారం పడి కాలిపోవడంతో పాటు మరమ్మతుల్లో జాప్యం, విద్యుత్ అంతరాయం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో అవసరమైన చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు బడ్జెట్ అంచనాలు రూపొందిస్తున్నారు. ఫీడర్‌లపై 150యాంప్స్‌కు మించితే లోడ్‌ను డైవర్ట్ చేసేందుకు సర్వే మొదలు పెట్టారు. తాండూరు సర్కిల్‌లో ఓవర్‌లోడ్‌ను తట్టుకునేందుకు అదనంగా 23 ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం ఉందని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. పురాతన, డ్యామేజ్ అయిన కండక్టర్ల వైర్లను మార్చాలని నిర్ణయించారు. విద్యుత్ వాడకం ఎక్కువ ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లను అదనంగా ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే లైన్‌మన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్ ద్వారా ప్రాథమిక సమాచారాన్ని అధికారులు సేకరించారు.

భవిష్యత్ తరాలకు ఉపాధే ప్రభుత్వ లక్ష్యం



కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న దాసర్లపల్లి నాయకులు

కందుకూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం దాసర్లపల్లికి చెందిన జంబుల శివరాంరెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీల కార్యకర్తలు, నాయకులు కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వచ్చే పదేళ్ల పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాంతంలో ఫ్యూచర్ సిటీతో పాటు ఏటీసీ, స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, సొసైటీ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు మల్లేష్, గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి, యుగేందర్‌గౌడ్, పాండురంగారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాణాప్రతాప్‌రెడ్డి, మదన్‌పాల్‌రెడ్డి, జంగయ్య, శేఖర్, రాములు, యాదయ్య, కృష్ణ, లింగమయ్య, శ్రీపాదయ్య, రంగయ్య పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ప్రయత్నాలు



ఆమనగల్లు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి కోసం కడ్తాల మండలం మైసిగండి గ్రామానికి చెందిన టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. పార్టీ అదిష్ఠానం, అగ్రనేతలను కలిసి తనకు డీసీసీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని అభ్యర్థిస్తున్నారు. డీసీసీ అధ్యక్ష పదవుల్లో బీసీలకు సముచిత స్థానం పార్టీ కల్పిస్తుందన్న సమాచారంతో శ్రీనివాస్‌గౌడ్ ఆ పదవిని దక్కించుకునేందుకు ప్రయత్నాలు తీవ్రతరం చేశారు. కాంగ్రెస్ పార్టీకి శ్రీనివాస్‌గౌడ్ మూడు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నారు. 2006-2014 వరకు మైసిగండి ఎంపీటీసీగా, 2013లో ఉమ్మడి ఆమగల్లు పీఏసీఎస్ చైర్మన్‌గా, సుమారు ఏడేళ్ల పాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సేవలందించారు. 2014లో చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపు కోసం, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విజయంకోసం కృషి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తనకు నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని చాలా కాలంగా అధిష్ఠానంపై శ్రీనివాస్ గౌడ్ ఒత్తిడి తెస్తున్నారు. తన విధేయతను గుర్తించాలని అభ్యర్థిస్తున్నారు. చల్లా వంశీచంద్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, మల్లు రవిలకు ఆయిళ్ల అత్యంత సన్నిహితుడిగా మెలుగుతూ వస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో కూడా ఆయనకు మంచి పరిచయం ఉంది. గౌడ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్‌కు బీసీల్లో కూడా గట్టిపట్టుంది. పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని శ్రీనివాస్‌గౌడ్ అనుచరులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన ఆచారి



ఆమనగల్లు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలో సీఎంను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ నెల 31న జరిగే తన కుమారుడు తల్లోజు భరత్ నిశ్చితార్థానికి రావాలని సీఎంకు ఆచారి ఆహ్వానపత్రికను అందజేశారు. అలాగే ఆమనగల్లులో ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్, ఎస్టీవో, ఆర్టీఏ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని, అసంపూర్తిగా నిలిచిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయించాలని ఈ సందర్భంగా సీఎంను కోరినట్టు ఆచారి తెలిపారు. అలాగే డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీలు నిర్మించాలని, ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు ఆచారి పేర్కొన్నారు.

సీఎంతో ఆసిఫ్ అలీ



కడ్తాల్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్య క్షుడు ఆసిఫ్ అలీ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కడ్తాల మండల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందించాలని,ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరగా సానుకూలంగా స్పందించారని ఆసిఫ్ తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

మేడ్చల్‌టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) మేడ్చల్ మున్సిపల్ పరిధిలో నెలకొన్న మంచి నీటి సమస్యనుపరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు సోమవారం కలెక్టర్ మనుచౌదరికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు శైలజ మాట్లాడుతూ రెండు నెలలుగా మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిందన్నారు. పలు మార్లు స్థానిక మున్సిపల్ అధికారులకు, మిషన్ భగీరథ సిబ్బందికి వినతులు సమర్పించినప్పటికీ పట్టించుకోవటం లేదని ఆరోపించారు. మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు.



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ వైద్యం

- తాండూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆపరేషన్లు
- ఆరోగ్యశ్రీ కింద ఆర్థో, జనరల్ సర్జరీలు



తాండూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు వివిధ ఆపరేషన్లను నిర్వహిస్తుండటంతో బీద రోగులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో రెండు నెలలుగా ఆరోగ్యశ్రీ కింద 50 ఆపరేషన్లు నిర్వహించారు. వాటిలో అత్యధికంగా ఆర్థో కేసులు ఉన్నాయి. రోడ్డు ప్రమాదాలు, ప్రమాదవశాత్తు తీవ్ర గాయాలై బోన్ ఫ్రాక్చరైన వారికి కార్పొరేట్ స్థాయిలో వైద్యాన్ని అందిస్తున్నారు. గతంలో కేసులను హైదరాబాద్‌కు రిఫర్ చేసేవారు. తాండూరు ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్లు, అధునాతన పరికరాలు అందుబాటులో ఉండటంతో వైద్యులు సైతం శస్త్ర చికిత్సలకు ముందుకొస్తున్నారు. ఆస్పత్రిలోని సిటి స్కాన్, ఎక్స్‌రే, మందులు, మత్తువైద్యులు ఉండటంతో ఆపరేషన్ల నిర్వహణకు సులువైంది. నయాపైసా ఖర్చు కాకుండా ఆస్పత్రిలో చికిత్సలు అందుతుండడంతో రోగులు కూడా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



వికారాబాద్‌లో కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, తదితరులు

తాండూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు రాకుండా సకాలంలో వడ్లు, పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు విన్నవించా టరు. మాజీ జెడ్పీటీసీ ధారాసింగ్, మాజీ సర్పంచ్ ఉత్తంచంద్‌తో కలిసి సోమవారం కలెక్టర్‌ను కలిశారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇబ్బందులు లేకుండా ఇసుక పర్మిషన్లు ఇవ్వాలని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. తాండూరు-హైదరాబాద్ రోడ్డులో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని, నియోజకవర్గానికి మంజూరైన సబ్‌స్టేషన్లను త్వరగా ఏర్పాటు చేయాలని తదితర ముఖ్య సమస్యలపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే వివరించారు.

సీజేఐపై దాడి హేయమైన చర్య



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు

ఆదిభట్ల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి భారత న్యాయ వ్యవస్థపై దాడేనని, దాడికి పాల్పడిన అడ్వకేట్ రాకేశ్‌కిషోర్‌ను అరెస్ట్ చేసి శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి ఎమ్మార్పీఎస్ నాయకులు ర్యాలీగా వచ్చి ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై షూతో దాడి చేయడం దారుణం అన్నారు. కుల, మతాల పేరుతో విద్వేషాన్ని నింపుకొని దాడులకు దిగడం సరికాదన్నారు. రాజ్యాంగం వల్లే అన్ని కులాలకు న్యాయం అందుతోందన్నారు. సీజే గవాయి నిమ్న వర్గాలకు చెందిన వ్యక్తి కావడమే దాడికి కారణమా? అని ప్రశ్నించారు. ఈ విషయంలో నిందితులను శిక్షించే వరకు ఎమ్మార్పీఎస్ నిరసనలు చేపడుతుందన్నారు. ఈ నెల 22న హైదరాబాద్‌లో నిరసన ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డికి వినితిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, జిల్లాధ్యక్షుడు బాబు, ఎమార్పీఎస్ నాయకులు కృష్ణ, శ్రీనివాస్, రమేష్, సతీష్, మహేష్, శ్రీకాంత్, నాగభూషణ్ పాలొనారు.

గవాయ్‌పై దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ధర్నా



ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వికారాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దళితుడైన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేశ్‌కిషోర్ చేసిన దాడిని ఖండిస్తూ మాదిగ మహాజన సోషలిస్టు పార్టీ(ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో సోమవారం వికారాబాద్‌లోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.ఆనంద్ మాట్లాడుతూ.. చీఫ్ జస్టిస్‌పై దాడి దేశ ప్రజాస్వామ్యంపై దాడి అన్నారు. దాడిచేసిన న్యాయవాదిపై దేశద్రోహం కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. దళితుడైన గవాయ్ సీజేఐగా ఉండడం జీర్ణించుకోలేని అధర్మ శక్తులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి ప్రశాంత్, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి సుభాష్, నాయకురాలు పుష్పరాణి, సీనియర్ నాయకులు భరత్‌కుమార్, మంజుల, పద్మమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి

మేడ్చల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అధికారుల నుంచి సామాన్య ప్రజల వరకు అందరికీ సీపీఆర్‌పై అవగాహన ఉండాలని డీఎంహెచ్‌వో ఉమాగౌరి సూచించారు. మేడ్చల్ కలెక్టర్ ఆవరణలో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పునర్జన్మ పేరుతో సీపీఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ శాఖల జిల్లా అధికారులకు, కలెక్టర్, ప్రజలకు సీపీఆర్‌పై వైద్యులు అవగాహన కల్పించారు. సీపీఆర్‌పై అవగాహన లేకపోవడం వల్ల కలిగే ప్రాణనష్టం గురించి వివరించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. పునర్జన్మ వారోత్సవాల్లో భాగంగా వారం రోజులు అన్ని కళాశాలల్లో, బస్టాండ్‌లలో, రైల్వేస్టేషన్‌ల వద్ద అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వైద్యులు శ్రవణ్, వినోద్, శోభన సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమం టలో ప్రోగ్రాం అధికారి మల్లీశ్వరి, ఆయా శాఖల అధికారులు, వైద్యులు గీత, శ్రీదేవి, సత్యవతి, చంద్రకళ, వసంతకుమారి, వినోద్ పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

క్రీడాకారులకు అండగా ఉంటా..



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు కులమతాలు, పార్టీలు అనే భేదం లేకుండా స్వేచ్ఛగా ఆటలు ఆడుకోవచ్చని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. విజయదశమి వారోత్సవాలను పురస్కరించుకుని షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే శంకరన్న క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్రికెట్ పోటీ విజేతలకు నగదు బహుమతితో పాటు మెమెంటోలను క్రీడాకారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలను ప్రోత్సహించేందుకు కృషిచేస్తున్నారని తెలిపారు. తన దృష్టి లో క్రీడలు ప్రతీ మనిషికి అవసరం అని, క్రీడాకారులు గ్రామీణ స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయిలో క్రీడలకు పూర్తి సహకారం అందుతుందని అన్నారు. క్రికెట్ పోటీలో విజయం సాధించిన ఫరూఖ్‌నగర్ అడ్డు జట్టుకు రూ.లక్ష నగదు, రన్నర్ టీంకు రూ.50వేల నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, రఘునాయక్, బస్వం, పురుషోత్తంరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

పెద్దేముల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం వహించొద్దని డివిజనల్ పంచాయతీ అధికారి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కందనెల్లి గ్రామాన్ని సోమవారం సందర్శించారు. నర్సరీని, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. గ్రామంలో మురుగు కాల్వలు ఎప్పటికప్పుడూ శుభ్రంగా ఉండేలా పూడిక తీయించాలని కార్యదర్శిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో తరన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంగళికుంట తండా రోడ్డంతా...

గోతులమయం

20ఏళ్లుగా కనీస మరమ్మతులకు నోచుకోని రెండు జిల్లాలను కలిపే దారి

- రాకపోకలకు జనం ఇబ్బందులు.. నరకప్రాయంగా ప్రయాణం
- నిధులు మంజూరైనా టెండర్లలో జాప్యం
- వెంటనే పనులు చేపట్టాలంటున్న ప్రజలు



బీటీ లేచిపోయిన మంగళికుంట తండా రోడ్డు

ఆమనగల్లు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మండలం పోలెపల్లి గేటు నుంచి పోలెపల్లి మీదుగా మంగళికుంట తండా వరకు ఉన్న బీటీ రోడ్డు పూర్తిగా శిథిలమై నరకప్రాయంగా మారింది. ఈ రోడ్డుపై రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 20ఏళ్ల క్రితం నిర్మించిన 3కిలో మీటర్ల ఈ రోడ్డు నిర్వహణ లేక ఎక్కడికక్కడ బీటీ లేచిపోయి గుంతలమయంగా మారింది. రెండు జిల్లాలను కలిపే ఈ రోడ్డు ఇటీవలి వర్షాలకు మరింత దెబ్బతింది. దీంతో ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డు మీదుగా ఆమనగల్లు, నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ, కల్వకుర్తి, చారగొండ, మండలాల గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వెల్దండ మండలం అంకమోనికుంట, సల్లపల్లి, బొల్లంపల్లి గ్రామాల వారికి ఈ రోడ్డు సౌకర్యంగా ఉంది. మాడ్గుల, ఆమనగల్లు మండలాల పలు గ్రామాల ప్రజలు ఈ రోడ్డుగుండానే కల్వకుర్తి పట్టణానికి వెళ్తుంటారు. రోడ్డు నిర్మాణ సమయంలో నాణ్యత పాటించకపోవడం, అప్పట్లో యంత్రాలతో కాక కూలీలతో పనులు చేయించడం, నిర్వహణ లోపంతో రోడ్డు పూర్తిగాపాడైంది. పోలెపల్లి గేటు నుంచి మంగళికుంట తండా వరకు బీటీ రోడ్డు పనులకు రెండేళ్ల కింద రూ.64లక్షలు మంజూరయ్యాయి. 2023 ఆగస్టు 29న అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పనులకు శంకుస్థాపన చేశారు. టెండర్ నిర్వహించినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. పనులు ప్రారంభం కాక మంజూరైన నిధులు సైతం ల్యాప్స్ అయ్యాయి.

రూ.కోటి నిధుల మంజూరు

మంగళికుంట తండా రోడ్డు రిపేర్ చేయించాలని గ్రామాలు, తండాల ప్రజలు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డిపై ఒత్తిడి తెచ్చారు. రోడ్డు బాగలేక పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఆయన స్పందించి చొరవ తీసుకొని పది నెలల క్రితం ఎంఆర్ఆర్ గ్రాంట్ కింద రూ.కోటి మంజూరు చేయించారు. దీంతో రోడ్డు వేస్తారని ప్రజలు భావించారు. అయితే నెలలు గడుస్తున్నా టెండర్ల ప్రక్రియైనా పూర్తికాక పనులు ప్రారంభించలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నిరుత్సాహానికి గురవుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయించాలి



పోలెపల్లి గేటు-పోలెపల్లి మీదుగా మంగళి కుంట తండా రోడ్డు పూర్తిగా పాడైంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. రోడ్డుపై గోతులేర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని పనులు త్వరగా చేయించేలా చర్యలు తీసుకోవాలి. అధికారులు టెండర్ల ప్రక్రియ త్వరగా చేపట్టాలి.

- శోభచందూనాయక్, కొత్తకుంట తండా

ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం



మూడు కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. 2003లో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద వేసిన రోడ్డుకు నేటికీ మరమ్మతులు చేయలేదు. దీనిపై నడవడం కూడ ఇబ్బందిగా మారింది. రోడ్డు మరమ్మతులు చేసి మా ఇబ్బందులు తీర్చాలని ఏళ్లుగా ప్రజాప్రతినిధులను, అధికారులను కోరుతున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. నెల రోజుల్లో రోడ్డు పనులు చేపట్టకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

- దోనాదుల కుమార్, పోలెపల్లి

టెండర్ల ప్రక్రియ మొదలైంది



ఎంఆర్ఆర్ గ్రాంట్ కింద పోలెపల్లి గేటు-మంగళికుంట తండా మూడు కిలోమీటర్ల రోడ్డు మరమత్తు, ఆధునికీకరణకు జనవరిలో రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. ఇటీవల పనులకు టెండర్ల ప్రక్రియ చేపట్టాం. టెండర్లు పూర్తికాగానే పనులు పూర్తిచేసి ప్రజల ఇబ్బందులు తీరుస్తాం.

- శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్-డీఈఈ, ఆమనగల్లు

ప్యాచ్‌వర్క్ పెండింగ్...

- ఇప్పలపల్లి-కమ్మదనం రోడ్డు పనుల్లో జాప్యం
- కంకరతో వాహనదారుల ఇక్కట్లు



కేశంపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్-ఆమన్‌గల్ రోడ్డులో ఇప్పలపల్లి-కమ్మదనం దారికి చేపట్టిన ప్యాచ్‌వర్క్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కంకర వేసి వదిలేయడంతో వాహనదారుల ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. కేశంపేట మండలం ఇప్పలపల్లి నుంచి ఫరూఖ్ నగర్ మండలం కమ్మదనం వరకు ఉన్న ఈ బీటీ రోడ్డు వర్షాలకు అక్కడక్కడ దెబ్బతిని గుంతలేర్పడ్డాయి. దీంతో ఇబ్బందులు పడుతున్నామని కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే శంకర్ దృష్టికి తీసుకపోయారు. స్పందించిన ఆయన ప్యాచ్ పనులకు నిధులు మంజూరు చేయించారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ సిమెంట్, కాంక్రీట్, కంకర పరిచి వదిలేశాడు. ఇంత వరకు బీటీ వేయలేదు. కంకర పోసినచోట వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కంకరతో దుమ్ము లేస్తోంది. అధికారులు స్పందించి ప్యాచ్ పనులను త్వరగా పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు వెంటనే ప్రారంభించాలి



ఇప్పలపల్లి-కమ్మదనం రోడ్డులో ప్యాచ్ పనులను వెంటనే ప్రారంభించాలి. ప్యాచ్ వర్క్ వద్ద కంకర వేసి వదిలేయడంతో రాత్రి పూట వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దుమ్ములేస్తూ కళ్లలో పడుతోంది. ఈ రోడ్డులో టీవీలర్లు నడపలేం. అధికారులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి వెంటనే పనులు చేయించాలి.

- శ్రీనివాస్, సీఐటీయూ మండల కన్వీనర్

బురదమయం.. కొత్తకుంట తండా రోడ్డు



ఆమనగల్లు మండలం పరిధి పోలెపల్లి-కొత్తకుంట తండా రోడ్డుపై అడుగడుగునా గోతులేర్పడ్డాయి. కొన్ని రోజుల క్రితం కురిసిన వర్షానికి రోడ్డంతా నీటి గుంతలతో దర్శనమిస్తోంది. తండా వాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పోలెపల్లి-కొత్తకుంట తండా వరకు 2.5కిలోమీటర్ల రోడ్డు ధ్వంసమైంది. గతంలో ప్రభుత్వం రోడ్డు పనులకు రూ.1.5కోట్లు మంజూరు చేయగా పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత నిధులు రాక పనులు చేయలేదు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవ తీసుకొని తండాకు బీటీ రోడ్డు నిర్మించి ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

కేఎల్‌హెచ్ అజీజ్‌నగర్‌కు ఏడు స్టార్టప్స్

- హర్షం వ్యక్తం చేసిన అధ్యాపకులు, విద్యార్థులు



విద్యార్థులతో కేఎల్‌హెచ్ అధ్యాపకులు

మొయినాబాద్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : మొయినాబాద్ మండంలోని కేఎల్‌హెచ్ క్యాంపస్ విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు జరుగుతున్నాయని కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్, ఇంజినీర్ లక్ష్మణ్ హవీష్, కేఎల్‌హెచ్ అజీజ్‌గనర్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్, రామకృష్ణ తెలిపారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. అజీజ్‌గనర్ క్యాంపస్ హైదరాబాద్‌కు గర్వకారణమైన మైలురాయిని చేరుకుందన్నారు. క్యాంపస్ విద్యార్థుల నేతృత్వంలోని ఏడు స్టార్టప్‌లకు ఐటీ హైదరాబాద్ ఐటీ హబ్ నుంచి మొత్తం రూ.19లక్షల నిధులు వచ్చాయని చెప్పారు. ఈ నిధులు ఆరోగ్యరంగం, రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, ఇంటలిజెన్స్ ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ వంటి రంగాల్లో ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు కేటాయిస్తామని తెలిపారు. గత సంవత్సరంలోనూ కేఎల్‌హెచ్ హైదరాబాద్ క్యాంపస్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విద్యార్థి ఆర్యమాన్‌కుమార్‌చౌదరి తన స్టార్టప్ కోసం ఇలాంటి నిధులు పొందాడన్నారు. క్యాంపస్‌లో ఉన్న బలమైన ఆవిష్కరణ వాతావరణానికి ఇది ప్రతీక అన్నారు.విద్యార్థుల సృజనాత్మకత ఆలోచనాశక్తి, అధ్యాపకుల కృషికి ఇది ఫలితం అన్నారు. విద్య అనేది అకడమిక్ ప్రావీణ్యానికి మాత్రమే పరిమితం కాదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఉద్యోగాలు సృష్టించేలా కృషి చేయాలి



అల్యూమినేట్ వర్క్‌షాప్‌లో సెయింట్ పీటర్స్ కళాశాల విద్యార్థులు

మేడ్చల్ టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):సాంకేతిక విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు కేవలం ఉద్యోగాలు సంపాదించేలా కాకుండా ఉద్యోగాలు సృష్టించేస్థాయికి ఎదగాలని వ్యాపారవేత్త నవీన్‌కుమార్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళా టశాలలో సోమవారం అల్యూమినేట్ వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి నవీన్‌కుమార్ హాజరై మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థులు ఎక్కువగా ఉద్యోగం సాధించి స్థిరపడేందుకు యోచిస్తారన్నారు. ఉద్యోగం చేయడం కన్నా ఉద్యోగాలు కల్పించేలా ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీవీ.రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ టి.సరోజారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ టి.అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవి, సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



చేవెళ్ల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేయడం సంతోషకరంగా ఉందని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం దేవుని ఎర్రవల్లి, రామన్నగూడ, సింగప్పగూడ గ్రామాలకు చెందిన ఆరుగురు విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. దేవుని ఎర్రవల్లి స్కూలుకొచ్చే విద్యార్థులకు మరిన్ని సైకిళ్లు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు శ్రీనివాస్, సామ రంగారెడ్డి, మల్లారెడ్డి, రవీందర్, రామ్‌రెడ్డి, సత్యనారాయణ, శివయ్య, రాజిరెడ్డి, జంగయ్య గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు ఉండొద్దు

- అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి):వానాకాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో మాట్లాడుతూ .. ముందస్తు ప్రణాళిక ప్రకారం అన్ని విభాగాలు సమన్వయంతో కొనుగోళ్లు నిర్వహించాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా ధాన్యం సేకరణ వివరాలు సక్రమంగా డాటా ఎంట్రీలో పొందుపర్చాలన్నారు. రవాణా, డ్రైమిషన్‌లు, ప్యాడీ క్లీనర్లు, వేయింగ్ మిషన్లను సిద్ధం చేయాలని ఆయన సూచించారు. రాష్ట్ర సరిహద్దుల్లో ధాన్యం అక్రమ రవాణా నివారణకు రావులపల్లి, కోత్లాపూర్ వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రాల్లో గన్నీ సంచులు, తాగునీరు, టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు వంటివి ఉండేలా చూడాలన్నారు. ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. రైతుల బ్యాంక్ ఖాతాల్లో ఆలస్యం లేకుండా డబ్బులు జమయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, అదనపు ఎస్పీ రాములునాయక్, సివిల్‌సప్లయిస్ అధికారి సుదర్శన్, డీసీవో నాగార్జున, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ

కొడంగల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కొడంగల్‌కు మంజూరైన మెడికల్, వెటర్నరీ కళాశాలలు, పాత కొడంగల్‌లో ఇంటిగ్రేటెడ్ గురుకులాలను స్థానికంగానే ఏర్పాటు చేయాలని కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు అన్నారు. సోమవారం కొడంగల్‌లో ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ప్రజల సంతకాల సేకరణ చేశారు. వ్యాపారులు, కుల, మత వర్గ భేదం లేకుండా ప్రజలు సంపూర్ణ మద్దతు తెలుపుతూ విద్యాసంస్థలను తరలించొద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్ కోట్రికె లక్ష్మీనారాయణగుప్తా, కో-కన్వీనర్లు సురేశ్‌కుమార్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, రమేశ్‌బాబు పాల్గొన్నారు.



సంతకాల సేకరణ చేపడుతున్న జేఏసీ నాయకులు

కాంగ్రెస్ పాలనలో మెరుగైన వసతుల కల్పన



హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయిస్తున్న గూడూరు శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మెరుగైన వసతులు సమకూరి ఇబ్బందులు తొలుగుతున్నాయని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాలలోని బీసీ కాలనీలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటును సోమవారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి నిధుల నుంచి లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో అభివృద్ధి పనులకు నిధల మంజూరుకు ఎమ్మెల్యే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. గ్రామాల్లో అంతర్గత రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, తాగునీటి వసతి కల్పన, పారిశుద్య కార్యక్రమాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అభివృద్ధిలో రాజకీయాలకు చోటు లేదని, ప్రజా సంక్షేమం, అభివృద్ధిల్లో ప్రజలంతా పాలు పంచుకోవాలని శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్, నాయకులు యాదయ్య, బుచ్చయ్య, కృష్ణ, రాజేందర్ గౌడ్, రాఘవేందర్, చందు, బుద్ధిరామ్, తిరుమల్లేశ్, జంగయ్య, చంద్రయ్య, బ్రహ్మచారి, శ్రీను, పాండు, మహేశ్, శ్రీకాంత్, రమేశ్, సేవానాయక్, పవన్, రాజు పాల్గొన్నారు.

నూనె గింజల సాగుపై దృష్టి సారించాలి



పరిగిలో రైతులకు విత్తనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నూనెగింజల ఉత్పత్తి పంటల సాగుపై దృష్టి సారించాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. జాతీయ తినదగిన నూనె గింజల మిషన్ ఆధ్వర్యంలో సోమవారం పరిగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతులకు రాయితీపై నూనెగింజల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అయిల్ ఉత్పత్తి పంటల సాగు తక్కువ ఖర్చులతో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చన్నారు. ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం, ఏఎంసీ చైర్మన్ పరశురాంరెడ్డి, ఆత్మ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్ ఎంపీడీవో విజయలక్ష్మి బదిలీ



ఎంపీడీవో విజయలక్ష్మిని సన్మానిస్తున్న సిబ్బంది

మోమిన్‌పేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మోమిన్‌పేట్ ఎంపీడీవో విజయలక్ష్మి బదిలీ అయ్యారు. రంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం ఎంపీవో యాదగిరి, సూపరింటెండెంట్ రాజమల్లయ్య, సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

పరిశుభ్రతపై అవగాహన అవసరం



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

మోమిన్‌పేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో ప్రవీణ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో మంగళవారం పోషణ మాసంలో భాగంగా బాలికలకు రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత, పోషక విలువలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోషణమాసంలో భాగంగా ఈ నెల 16వ తేదీ వరకు అన్నీ గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సిములు, సూపర్‌వైజర్ పుష్పలత, సిబ్బంది రేణుక, వసంత, మమత, ప్రమీల, భాగ్య పాల్గొన్నారు.

'ప్రధానమంత్రి ఆవాస్ యోజన'ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ పంజాల రాజేష్, ఏఈ అల్లాజీ

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ పంజాల రాజేష్ సూచించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, మర్రిపల్లిగూడలో సోమవారం లబ్దిదారు ఈదుగళ్ల పోచమ్మకు అంగీకార్ పత్రాన్ని అందజేశారు. అనంతరం కమీషనర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద మున్సిపల్‌లో 149 ఇళ్లు మంజూరు కాగా 114 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. మిగత ఇళ్ల నిర్మాణాలు మార్కింగ్ దశలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ అల్లాజీ, ఇన్‌చార్జి ఆర్ఐ వినయ్, వార్డు ఆఫీసర్ పురుషోత్తంయాదవ్ పాల్గొన్నారు.

పట్టాభూమి కబ్జా

● చర్యలు తీసుకోవాలని బాధితుల విజ్ఞప్తి

శామీర్‌పేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తాము కొనుగోలు చేసిన పట్టా భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని భూ బాధితులు దొంతరపల్లి విజయ్‌సేన్‌రెడ్డి, రోహిత్‌రెడ్డిలు సోమవారం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బాధితులు సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. తూంకుంట మున్సిపల్ లోని అంతాయిపల్లి పరిధిలో సర్వేనంబర్- 103లో తమ ప్రజయ్‌ఇంజనీర్ సిండికేట్ సంస్థ 29 ఎకరాల 36 గుంటల పట్టా భూమిని 2005లో ఏజీపీఏ ద్వారా చట్ట ప్రకారం కొనుగోలు చేసిందని వెల్లడించారు. 2022లో మేడ్చల్ జిల్లా కోర్టును ఆశ్రయించి కేసు వేయగా, ఆ భూమిలోకి అక్రమార్కులు వెళ్ళకూడదని ఆ కోర్టు ఇన్‌జంక్షన్ ఆర్డర్ జారీ చేసినట్లు వారు తెలిపారు. అయినప్పటికీ ఈనెల 11న పట్టపగలు తమ పట్టా భూమిలోకి అక్రమార్కులు చంద్రశేఖర్, ప్రదీప్‌రెడ్డి, అడ్వకేట్ జీబీరెడ్డిలు వచ్చి బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. శామీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశామని భూబాధితులు విజయ్‌సేన్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి చెప్పారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కులకచర్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఘనపూర్ గ్రామానికి చెందిన గజ్జి వెంకటయ్య గుండె పోటుతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పీఎస్ పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ సోమవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వెంకటయ్య పిల్లలను చదివిస్తామని, కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాములు, చెన్నయ్య, బాలయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.

బాణాసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

కొడంగల్ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బాణాసంచా విక్రయాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని కొడంగల్ ఎస్సై జీవీ. సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసినా, సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అమృత్.. ఆలస్యం!

(ఐదో పేజీ తరువాయి)

పనులు ప్రారంభించి ఎక్కడి పనులు అక్కడే వదిలేశారు. ఏడాది అవుతున్నా పది శాతం కూడా పూర్తికాకపోవడంపై పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తవ్వి వదిలేయడంతో ఇబ్బందులు

పట్టణంలోని పలు కాలనీల్లో పైపులైన్ వేసేందకు తవ్వి వదిలేశారు. రోడ్లను తవ్వడంతో వర్షానికిబురదమయంగా మారడంతో కనీసం నడవడానికి వీల్లేకుండా పోయిందని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో మొత్తం 30.759కిలోమీటర్ల దూరం పైపులైన్ వేయాలని నిర్ణయించారు. వీటిలో 350ఎంఎం, 300 ఎంఎం, 250 ఎంఎం, 200 ఎంఎం, 110 ఎంఎం పైపులను వినియోగిస్తున్నారు. మెయిన్ గ్రావిటీ పైపులైన్‌లు 7.053కి.మీ, కాలనీలకు సరఫరా చేసేందుకు 12.810కి.మీ, ఇంటికి నల్లా కనెక్షన్ కోసం 10.896కిలోమీటర్ల పొడవునా పైపులైన్లు వేయాల్సి ఉంది. ప్రస్తుతం పరిగి మునిసిపాలిటీ పరిధిలో 5,132 ఇళ్లు ఉన్నాయి. వీటికి ఇప్పటికే ఆరు వేలకు పైగా నల్లా కనెక్షన్లు ఉన్నాయి. అయితే పాతవాటిలో కొత్త పైపులైన్‌లు వేయాల్సి ఉంది. ఇప్పటి వరకు ఉన్న ఆరు వేల నల్లా కనెక్షన్లలతోపాటు కొత్తగా 1,349 కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. టెండర్‌లో పనులు దక్కించుకున్న కాంటాక్టర్‌కు తొమ్మిది నెలల గడవులో పనులు పూర్తి చేయాలని ఉండగా, ఇప్పటి వరకు ఏడాది పూర్తవుతున్నా ఎక్కడి పనులు అక్కడే దర్శనమిస్తున్నాయి.

కాంట్రాక్టర్‌పై ఒత్తిడి పెంచుతాం



అమృత్-2 పథకం పరిగి మున్సిపాలిటీ పరిధిలో పనులు కొనసాగుతున్నాయి. నాలుగు ట్యాంకులు, పైపులైన్ పనులు జరుగుతున్నాయి. పనుల్లో కొంత జాప్యం జరిగిన విషయం వాస్తవమే. కాంట్రాక్టర్‌పై ఒత్తిడి పెంచి పనులు సకాలంలో పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం. పరిగిలో శాశ్వతంగా నీటి సమస్య తీరే విధంగా పనులు చేపడుతున్నాం.

-వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్, పరిగి

ట్రాఫిక్ అస్తవ్యస్తం!

(ఐదో పేజీ తరువాయి)



లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అక్కడ యూటర్న్ చేసే భారీ వాహనాలు వెనుక్కు ముందుకు కదిలేలోపే పెద్దసంఖ్యలో వాహనాలు జమ అవుతున్నాయి. దీంతో అక్కడ ట్రాఫిక్‌ను క్లియర్ చేయడం ట్రాఫిక్ పోలీసులకు ఇబ్బందిగా మారింది. బైపాస్ రోడ్డు నిర్మాణ సమయంలో జాతీయ రహదారికి ఇరువైపుల దాదాపు పావు కిలోమీటర్ దూరం వరకు ఎదులాబాద్ రోడ్డును ఆధీనంలోకి తీసుకున్న అధికారులు అనంతరం కనీస చర్యలు చేపట్టకపోవడం వలన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఘట్‌కేసర్‌లో రోడ్లపైన ఉన్న అక్రమణలను తొలగించడంతోపాటు అండర్ పాస్‌వద్ద భారీ వాహనాలు సులభంగా తిరిగేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరముందని వాహనదారులు సుచిస్తున్నారు. రానున్న రోజుల్లో ట్రాఫిక్ మరింతగా పెరిగే అవకాశమున్నందున ఆయా శాఖల అధికారులు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

నియంత్రణకు చర్యలు చేపట్టాం



ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులోని అండర్ పాస్ వద్ద భారీ వాహనాలు యూటర్న్ చేసే సమయంలో ట్రాఫిక్ జామ్ అవుతోంది. మాకు సమాచారం వచ్చిన వెంటనే అక్కడికి వెళ్లి వాహనాలను క్రమబద్ధీకరిస్తున్నాం. ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అయితే ఎవరైనా సమాచారం అందించాలి.

-రవీందర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, ఘట్‌కేసర్

అధిక ధరకు ఇసుక విక్రయాలపై ఫిర్యాదు



మాట్లాడుతున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగప్ప

తాండూరు రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లకు కావాల్సిన ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తున్నారని మండలంలోని పర్వతాపూర్, పలు గ్రామాలకు చెందిన ఇందిరమ్మ లబ్ధిదారులు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నాగప్ప దృష్టికి తేగా ఆయన సోమవారం ఎంపీడీవో విశ్వప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనుమతులు తీసుకొని సొంత ట్రాక్టర్లను పెట్టి ఇసుక తరలించేందుకు వెళ్తే పాత తాండూరు కాగ్నా నది వద్ద ఇసుక మాఫియా అడ్డుకొని వెనక్కి పంపిస్తున్నారని తెలిపారు.. అధికారులకు మాముళ్లు ఇచ్చి ఒక ట్రిపు రూ.6వేలకు చొప్పున విక్రయిస్తున్నా పోలీసులు, రెవెన్యూ, మైన్స్ అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమని నాగప్ప పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఇందిరమ్మ ఇళ్లకు కావాల్సిన ఇసుక దొరికే విధంగా అధికారులు సహకరించాలని నాగప్ప కోరారు.

తాత్కాలిక రోడ్డు పునరుద్ధరణ



వంతెన పక్కన వేసిన తాత్కాలిక రోడ్డు

దుద్యాల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుదురుమళ్ల గ్రామం నుంచి దౌల్తాబాద్ మండల కేంద్రానికి వెళ్లేందుకు తాత్కాలిక రోడ్డును సోమవారం పునరుద్ధరించారు. గ్రామ సమీపంలో పెద్ద వాగు ప్రవహిస్తోంది. ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉందనే కారణంగా అక్కడ వంతెన నిర్మాణం చేపడుతున్నారు. దీంతో పక్కనే తాతాల్కిక రోడ్డు వేసినా ఇటీవలే భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో సోమవారం ఆ రోడ్డును పునరుద్ధరించారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొడంగల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ బాలాజీ కేజీ ఉన్నత పాఠశాలలో 1995-1996 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. స్థానిక శ్రీ మంజునాథ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అప్పట్లో విద్యాబుద్దులు నేర్పించిన గురువులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు అప్పటి మధురజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనసూయ, పద్మ, షాహీదాబేగం, శరత్‌కళ, నారాయణ పాల్గొన్నారు.

కురుమ సంఘం మండల నూతన కార్యవర్గం

దారూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కురుమ సంఘం ధారూరు మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండలాధ్యక్షుడిగా అవుసుపల్లి గ్రామానికి చెందిన కుర్వ నర్సింహులును ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కుర్వ చంద్రయ్య, ఉపాధ్యక్షుడిగా కుర్వ మల్లేశం(మోమిన్‌కుర్ధు), ప్రధాన కార్యదర్శిగా కుర్వ ప్రశాంత్ కుమార్(ఎబ్బనూర్), కోశాధికారిగా కుర్వ రాజు(నర్సాపూర్), కార్యదర్శులుగా కుర్వ మహేష్(ధారూరు), కుర్వ సంఘమేశ్వర్(కుక్కింద), కార్యవర్గ సభ్యులుగా బీరప్ప, బాల్‌రాజ్, సాయిలు, సలహాదారులుగా నర్సింహులు, శ్రీశైలంలను ఎన్నుకున్నారు.

ఆర్మీ కళాశాలలో 'ఇన్వెస్టిచర్'



వేడుకల్లో ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు, ఎన్‌సీసీ క్యాడెట్లు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ కళాశాలలో సోమవారం ఇన్వెస్టిచర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కల్నల్ రాజాదత్త పాల్గొని మాట్లాడారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు దేశరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం క్యాడెట్లకు బ్యాడ్జీలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు, ప్రిన్సిపాల్ శ్రీలత, వైస్‌ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

పరిగి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల ఏర్పాటుకు మాదారం గ్రామస్తులు సోమవారం ఎస్ఐ మోహనకృష్ణకు అందజేశారు. మాజీ సర్పంచ్ వెంకటయ్య రూ.50వేలు, సాయిరాం రూ.50వేలు, మహేందర్ రూ.50వేలు, రాంచందర్‌రావు రూ.20వేలు, ఇతరులు కలిపి రూ.లక్షా 86వేలు అందజేశారు.

18న బంద్‌కు సహకరించాలి



నినాదాలు చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

వికారాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బీసీల్లోని అన్ని కుల సంఘాల ఐక్యంగా పాల్గొని ఈనెల 18న బంద్‌కు సహకరించాలని బీసీ సంఘం నాయకులు గుడిసె లక్ష్మణ్ అన్నారు. పట్టణంలోని క్లబ్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం బీసీ సంఘాల నాయకుల సమన్వయ సమావేశం నిర్వహించారు. మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిసె లక్ష్మణ్ అధ్యక్షత వహించగా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె. యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 18న జరుగబోయే బంద్ కార్యాచరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు కుక్కింద రాములు, శ్రీనివాస్, గోపాల్, సత్యనారాయణగౌడ్, శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, లక్ష్మణ్, బీఆర్‌శేఖర్, రమేష్, అంజయ్య, సురేష్‌బాబు, అశోక్, విజయ్‌కుమార్, అప్ప ఉమాశంకర్, బన్సీలాల్, చంద్రమౌళి, రాజశేఖర్, రాజు, మారుతి పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు



సామూహిక కుంకుమార్చనలో మహిళలు

పరిగి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పరిగిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక ఉత్సవాలు రెండోరోజు సోమవారం వైభవంగా జరిగాయి. ఉదయం హోమం, నవతలత స్వపనం, మూల ఉత్సవమూర్తులకు అభిషేకం, కృష్ణావతార అలంకారం, బలిహరణం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం నిత్యహోమం, ద్వారతోరణపూజలు, మూలమంత్రపారాయణం, బవిహరణం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు ఎదిరె పద్మ, కృష్ణ, జయశ్రీ, నరేందర్‌లు హోమాన్ని నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పురోహితులు సిద్ధాంతి పార్థసారథి గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి

నవాబుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదిరెడ్డిపల్లి నుంచి లింగంపల్లి మీదుగా గొల్లగూడ రైల్వేస్టేషన్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరారు. మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆధ్వర్యంలో సోమవారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్ పరమటి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రకాంత్, నాయకులు పాల్గొన్నారు.

యువ ఇంజనీర్లతోనే దేశ నిర్మాణం

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : దేశనిర్మాణం యువ ఇంజనీర్లపైనే ఆధారపడి ఉందని ఐఐటీ మద్రాస్ స్ట్రక్చరల్ ఇంజనీర్ గణేష్ బాబు కొడెబోయిన అన్నారు. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో సోమవారం మాస్టరింగ్ ఇన్నోవేటివ్ నెగోషియేటింగ్ అండ్ క్రియేటివ్ డ్రాఫ్టింగ్ కాంట్రాక్ట్స్ ఫర్ వాటర్ ప్రూఫింగ్, స్ట్రక్చరల్ రిపేర్స్ అండ్ ఇండస్ట్రియల్ ఫ్లోరింగ్ అనే అంశంపై జరిగిన వెబ్‌నార్‌కు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలి

దోమ: ప్రాథమిక పాఠశాలల్లో 20వేల వరకు ఎస్‌జీటీ ఉపాధ్యాయులను తగ్గించి, ఉన్నత పాఠశాలల్లో పీఈటీలను నియమించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని పీఆర్‌టీయూమోమిన్‌పేట్ మండల అధ్యక్షుడు ఆర్.కేశవులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలలకు పీఈటీలను నియమించాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉంటే పోస్టును క్రియేట్ చేసి ఇవ్వాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 60మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలనే నిబంధన సమంజసం కాదన్నారు.

మధ్యాహ్న భోజనం వండేందుకు నిరాకరణ

బొంరాస్‌పేట్: ఎన్కెపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనం చేసేందుకు ఏజెన్సీ మహిళ నిరాకరించింది. ఈ విషయం తెలుసుకున్న డీఈవో రేణుకాదేవి ఎంఈవో హరిలాల్‌ను ఆదేశించడంతో ఆయన పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు హెల్పర్‌తో మధ్యాహ్న భోజనం చేయించారు. అదే విధంగా ఉపాధ్యాయుల కొరత పట్ల ఆరా తీశారు.

కరెంట్ తీగల ఎత్తు పెంచాలి

పెద్దేముల్: పొలాలకు వెళ్లే దారిలో కరెంటు తీగాలు కిందకి వేలాడుతున్నాయని, వాటిని సరిచేసి ఎత్తు పెంచాలని రైతు నర్సిరెడ్డి ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని శంభు లింగేశ్వరాలయం సమీపంలో గల వ్యవసాయ పొలాల నుంచి చెరుకు లోడుతో లారీలు రావడం కష్టంగా ఉందన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

మోడల్ స్కూల్ వద్ద బస్‌షెల్టర్ ప్రారంభం

తాండూరు రూరల్: మండలంలోని ఐనెల్లి గ్రామ శివారులోని మోడల్ స్కూల్ సమీపంలో ఏసియా బ్రౌన్ ప్లేజ్ కంప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు సీఎస్ఆర్ కింద రూ.50వేలతో బస్‌షెల్టర్‌ను నిర్మించారు. ఈ బస్ షెల్టర్‌ను ప్రిన్సిపల్ శ్రీదేవి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కర్మాగారం ఎండి. మల్లేష్, సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాచారం హక్కుచట్టంపై అవగాహన

కీసర రూరల్: నాగారం, దమ్మాయిగూడ పురపాల పరిధిలోని ప్రజలకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్లు భాస్కర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ఆయా మున్సిపాలిటీల పరిధిలో సమాచార హక్కు చట్టం వార్షికోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్య బలోపేతం చేసే శక్తివంతమైన సాధనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈలు సంతోష్‌కుమార్, బాల మురళి, మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

మాలల రణభేరి మహాసభను జయప్రదం చేయాలి

శామీర్‌పేట: నవంబరు 23న హైదరాబాద్‌లో చేపట్టిన మాలల రణభేరి మహాసభను జయప్రదం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బురుగుల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శామీర్‌పేట మండల కార్యాలయాల సమీపంలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బురుగుల వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో మాల మహానాడు యువత బైక్‌ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి మాలమహానాడు నాయకులు పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాగా ఈ బైక్‌ర్యాలీని శామీర్‌పేట నుంచి ఉప్పరిపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించారు.

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడికి మాతృ వియోగం

బషీరాబాద్: బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పంజుగుల నర్సిరెడ్డి తల్లి పుష్పమ్మ(70) స్వగ్రామమైన ఇందర్‌చెడ్‌లో సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, ఆయన తండ్రి విఠల్‌రెడ్డి నివాళులర్పించారు.

క్రైం కార్నర్

స్కూటీని ఢీకొన్న కారు.. యువకుడి మృతి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : స్కూటీని కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన పోచారం ఐటీకారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని మల్లాపూర్‌కు చెందిన అర్ర సిద్దయ్య కుమారుడు సాయి యశ్వంత్(24) సివిల్ కాంట్రాక్ట్ పనిచేస్తుంటాడు. సాయి యశ్వంత్ ఆదివారం తన స్కూటీపై స్నేహితుడు కాసుల పవన్‌తో కలిసి పోచారం మున్సిపాలిటీ, చౌదరిగూడ సమీపంలో పైప్‌లైన్ మరమ్మతు పని చేసి తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో అనురాగ్ యూనివర్సిటీ దాటి నాడెం చెరువు సమీపంలోకి రాగానే వెనుక నుంచి వచ్చిన కారు స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయి యశ్వంత్‌కు తీవ్రగాయాలు కాగా కాసుల పవన్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం మేడిపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే సాయి యశ్వంత్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆస్పత్రి ఎదుట ఆందోళన.. ఉద్రిక్తం

● పోలీసుల లాఠీచార్జి

● ఆందోళనకారులు, ఆస్పత్రి నిర్వాహకులపై కేసులు

కీసర రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వైద్యం వికటించి వ్యక్తి మృతిచెందగా కీసరలోని నితిన్ ఆస్పత్రి వద్ద మృతుడి బంధువులు ఆదివారం రాత్రి ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. అయితే అర్ధరాత్రి దాటిన తర్వాత బంధువుల ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. వివరాల్లోకి వెళ్తే.. యాదాద్రి భువనగిరి జిల్లా పగిడిపల్లికి చెందిన తోటకూర మహేష్‌యాదవ్(35) బోనాల పండుగ సందర్భంగా మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడ మున్సిపాలిటీ కీసరలోని తన బంధువుల ఇంటికి వచ్చి అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అతన్ని స్థానిక నితిన్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉందని పెద్దాస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ క్రమంలో అతడిని నగరంలోని మరో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. దీంతో బంధువులు నితిన్ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే మహేష్‌యాదవ్ మృతిచెందాడని ఆరోపిస్తూ మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఆస్పత్రిలోని ఫర్నీచర్‌ను, కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. అదేసమయంలో కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డి పరిస్థితులను సమీక్షించేందుకు కీసరలోని ఆస్పత్రి వద్దకు చేరుకోగా ఏసీపీ చేతికి, ముగ్గురు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి. దీంతో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు అర్ధరాత్రి దాటిన తర్వాత పోలీసులు లాఠీచార్జి చేశారు. ఆందోళనకారులను అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేసారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడి, ఆస్పత్రి ధ్వంసం చేసినందుకు గానూ ఆందోళనకారులపై వేర్వేరుగా కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. ఆస్పత్రి నిర్వహకులపైనా కేసు నమోదు చేసామని, పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా కేసు తీవ్రత ఉంటుందని వెల్లడించారు. ఇదిలా ఉండగా పోలీసుల లాఠీచార్జ్‌లో పలువురు ఆందోళనకారులు తీవ్రగాయాలపాలయ్యారు. పోలీసులు విచక్షణా రహితంగా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మృతుని కుటుంబానికి న్యాయం కావాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఎద్దును ఢీకొన్న బొలెరో

● ఇద్దరికి తీవ్రగాయాలు ● ఒకరి పరిస్థితి విషమం

వికారాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బొలెరోలో అతివేగంగా వెళ్తూ ఎద్దును ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా వారిలో ఒకరి పరిస్థితి విషమంగా మారింది. ఈ ఘటన వికారాబాద్ పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్‌లోని గోదుమగూడ సమీపంలోని ఓరిసార్ట్‌లో పనిచేస్తున్న అస్సాంకు చెందిన ఇద్దరు యువకులు పని నిమిత్తం బులేరో వాహనంలో హైదరాబాద్ వెళ్లి వికారాబాద్ వైపు అతివేగంగా వస్తున్నారు. ఈ క్రమంలో ధన్నారం సమీపంలో పశువుల మంద అడ్డుగా రాగా ఓ ఎద్దును ఢీకొట్టారు. దీంతో బొలెరో వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనంలో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వారికి చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో ఎద్దు రెండు కాల్లు, కొమ్ములు విరిగడంతో రైతు చిప్ప లక్ష్మయ్య అక్కడే కూర్చుని రోధించడం కలచివేసింది. ఎద్దు విలువ రూ.70వేలు ఉంటుదని బాధితుడు తెలిపాడు.

వ్యక్తి అదృశ్యం



శేఖర్(ఫైల్)

యాలాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన ఘటన యాలాల మండల మండలంలో చోటుచేసుకుంది. యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అన్నాసాగర్‌కు చెందిన దొడ్ల శేఖర్ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 9వ తేదీన రాత్రి 10గంటల సమయంలో శేఖర్ బాణాపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శెట్టి నాయక్ (సునిల్) కలిసి వెళ్లారు. అయితే శేఖర్ తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య దొడ్ల కవిత చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల వద్ద వెతికినా ఎలాంటి ఆచూకీ కనిపించలేదు. దీంతో కవిత యాలాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కనిపించకుండా పోయిన వ్యక్తి నలుపు రంగు టీషర్టు, ప్యాంటు, రెయిన్ కోట్ ధరించి ఉన్నాడని, ఛామన ఛాయ, 5.5ఎత్తు, తెలుగు, హిందీ భాష మాట్లాడతాడని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు సమాచారం అందించాలని కోరారు.

పంక్చర్ షాపులోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

తాండూరు రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌతాపూర్ గ్రామ శివారులో అంబికా ట్రాన్స్‌పార్మర్ సమీపంలోని ఓ పంక్చర్ దుకాణంలో ట్రాక్టర్ దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఓగిపూర్ నుంచి ట్రాక్టర్‌లో గోడరాయి లోడ్‌తో బయల్దేరింది. డ్రైవర్ మద్యం మత్తులో ఉండటంతో తాండూరు వైపు వస్తూ గౌతాపూర్ సమీపంలోకి రాగానే వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పించర్ షాపును ఢీకొంది. ఈ ప్రమాదంలో నాలుగు బైకులు ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్, ఆటో సీజ్

యాలాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్, ఆటోను సీజ్ చేసినట్లు యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. యాలాల మండలం విశ్వనాథ్‌పూర్ నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. వెంటనే అక్కడికి వెళ్లి చూడగా, అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ మహబూబ్‌గా గుర్తించి, ట్రాక్టర్‌ను సీజ్‌చేసినట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలోని కోకట్‌కు చెందిన రాంచందర్‌కు చెందిన ఆటోలో వాగు నుంచి ఆటోలో ఇక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఆటోను ఆపి అనుమతి పత్రాలు కోరగా, ఎలాంటి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు బీసీల సన్నాహక సమావేశం

తాండూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోనంబర్ 9ని హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ ఈనెల 18వ తేదీన బీసీ జేఏసీ తరుపున రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఈ నెల 15వ తేదీన తాండూరులోని వినాయక కన్వెన్షన్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేసినట్లు బీసీ జేఏసీ నాయకుడు ఈడ్గి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. తనతో పాటు బీసీ జేఏసీ మరో నాయకుడు కందుకూరి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉదయం 10గంటలకు అఖిలపక్ష పార్టీలు బీసీ సంఘాలు, కుల సంఘాలు, బీసీ మేధావులు, ఎస్సీ ఎస్టీ బీసీ సంఘాల సన్నాహక సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశానికి పెద్ద ఎత్తున హాజరు కావాలని అన్నారు.